క్లుప్తంగా

ప్రతిభావంతులకు అభినందనలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రేమ

మల్కాపురం: ఆంధ్రా యూనివర్సిటీలో విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల విద్యార్థులకు ఈ నెల 20,21వ తేదీల్లో నిర్వహించిన పోటీల్లో మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. దీంతో ఏయూ వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి కళాశాల విద్యార్థినులు అభినందించారు. విద్యార్థులను కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, కళాశాల రాజనీతి శాస్త్ర సీనియర్ అధ్యాపకురాలు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవిలు అభినందించారు.

భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రచారం


ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భగవద్గీతపై ఆధ్యాత్మిక బోధన, ప్రచార కార్యక్రమం జరిగింది. శోభకృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా హిందూ ధర్మ ప్రదాత, త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధకులు శ్రీనివాస్, దేవి, మణి, కార్తీక్, సర్వధారి, అక్షయ్‌కుమార్, సన్నీ తదితరులు మాట్లాడుతూ ఉ(యు)గాది అంటే యుగానికి ఆది అని, దేవుని చేత సృష్టి ఏర్పడింది కాబట్టి మొట్టమొదటి పండగని తెలిపారు. ఉగాది పండగ, పచ్చడి విశిష్టతలను వివరించారు. భగవద్గీత ప్రజలకు సన్మార్గం చూపుతుందని, దీనిని నిత్యం చదివే వారిలో జ్ఞానం వికసిస్తుందని పేర్కొన్నారు.

50 ఏళ్లు దాటిన వారికి నైట్ బీట్స్ వద్దు


గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో డీసీపీ నాగన్న

గోపాలపట్నం: గోపాలపట్నం క్రైం పోలీస్ స్టేషన్‌ను క్రైం డీసీపీ నాగన్న శుక్రవారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ నిర్వహణ బాగుందని కితాబిచ్చారు. ఎస్ఐ నర్సింగ రాజుతో మాట్లాడి సిబ్బంది పరిస్థితులు, పనితీరుపై ఆరా తీశారు. సిబ్బంది యోగక్షేమాలు, ఇబ్బందులు, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా బీట్లు, నైట్ బీట్స్‌పై నిర్లక్ష్యంగా ఉండరాదని సూచించారు. 50 ఏళ్లు దాటిన వారికి కి నైట్ బీట్స్ వేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

27న మార్కెట్లకు వేలం పాట


గోపాలపట్నం: జీవీఎంసీ జోన్-8 పరిధిలోని మార్కెట్లను లీజుకిచ్చేందుకు ఈ నెల 27న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలో ఉన్న మార్కెట్లను ఒక ఏడాది పాటు కాలపరిమితికి లీజుకు ఇస్తామన్నారు. ఈమేరకు 27వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు వేపగుంట కార్యాలయంలో వేలం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు హాజరు కావాలని కోరారు. వివరాలు జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని జెడ్సీ సూచించారు.

ఇక నాణ్యమైన విద్యుత్

- 58వ వార్డులో ఫీడర్ వైర్ల మార్పు

మల్కాపురం: అసలే వేసవి.. ప్రతి ఇంట్లో ఫ్యాన్లు.. ఏసీలు.. కూలర్లు గిర్రుగిర్రుమంటాయి. ఒక్కసారి విద్యుత్ వినియోగం పెరుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. అందుకు అనుగుణంగా నిర్వహణ పనులు చేపడుతున్నారు. చిన్నచిన్న మరమ్మతులతో పాటు అవసరమైన చోట సామర్థ్యం పెంపు.. నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ లైన్ల ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇవి పూర్తయితే నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా పంపిణీ చేసేందుకు మార్గం సుగమం కానుంది.

జీవీఎంసీ 58వ వార్డులో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు శుక్రవారం చేపట్టారు. గుల్లలపాలెం ప్రాంతంలో శ్రీహరిపురం సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసరావు పర్యవేక్షణలో తుప్పు పట్టిన విద్యుత్ వైర్లను మార్చి కొత్త వైర్లు అమర్చారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల కరెంట్ పోవడంతో పాటు ఇళ్లల్లో గృహోపకరణాలు దెబ్బతినేవి. సమస్య తెలుసుకున్న సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసరావు స్పందించి నిర్వహణ పనులు చేపట్టారు. దీంతో కాలనీ వాసులు ఏఈ కి కృతజ్ఞతలు తెలిపారు. అయితే కొన్ని ఇళ్లలో హౌస్ వైరింగ్‌లో సాంకేతికపరమైన ఇబ్బందులు కారణంగా విద్యుత్ షార్టు సర్క్యూట్ అవుతుందని తెలిపారు. దీని వల్ల ఇంట్లో ఎలక్ట్రానిక్ సామగ్రికి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇంటి వైరింగ్‌లో లోపాలు ఉంటే ఎలక్ట్రీషియన్ ద్వారా సరిచేసుకోవాలని సూచించారు.


పాత వైర్ల స్థానంలో కొత్త విద్యుత్ తీగలు వేస్తున్న సిబ్బంది

మోడల్ వార్డుగా తీర్చిదిద్దడానికి సహకారం

- మేయర్ హరివెంకటకుమారి


మర్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్‌బెల్ట్‌లో మోడల్ లైట్ల వెలుగులు


జిమ్ పరికరాలను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డును మోడల్ వార్డుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్ గ్రీన్ బెల్టు వాకింగ్ ట్రాక్‌లో మోడల్ లైట్లతో పాటు జిమ్ సామగ్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంత పెద్ద కౌన్సిల్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు శ్రీధర్ సలహాలు, సూచనలు దోహతపడుతున్నాయని తెలిపారు. ఇక్కడి వాకింగ్ పార్క్‌కు వాచ్‌మెన్ రూము, నిర్వహణ కోసం అవసరమయ్యే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ మోడల్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని మర్రిపాలెం వుడాలే అవుట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ క్లబ్ సభ్యులు కోరారు. దీనిపై స్పందించిన ఆమె పరిశీలిస్తానని తెలిపారు. జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ నగరంలో ఏ వార్డుకీ లేని విధంగా 52వ వార్డులో గ్రీన్ బెల్టు ఉందన్నారు. దీన్ని అందంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. లైట్ల కోసం రూ.17 లక్షలు, పిల్లల ఆట వస్తువులు, జిమ్ పరికరాలు వంటివాటికి సుమారు రూ. 9లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. పార్కు శుభ్రంగా ఉంచేలా వాకింగ్‌కు వచ్చేవారు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విశాఖ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, హెల్తీ వాకర్స్ క్లబ్ సభ్యులు కె.నాగేశ్వరరావు, ఎస్. శ్యామ్ సుందర్, జాకబ్ లక్ష్మణరావు, మర్రిపాలెం వుడాలేఅవుట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్‌వీ సురేష్, సూర్యనారాయణ, శంకర్, శ్రీనివాస పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి గీతాలాపన


భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన భక్తి గీతాలాపన కార్యక్రమం అలరించింది. జె.మాధవికృష్ణ శిష్య బృందం కె.ధరణి, కె.కీర్తన, ఎం.తేజస్విని, జి.నిత్యశ్రీవల్లి అద్భుత గానంతో ఆహూతులను ఆకట్టుకున్నారు. అన్నమయ్య, రామదాసు, పురందరదాసు, త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. వీటిలో ముదాకారాత మోదకం, చూడరమ్మ సతులారా, బంగారు మేడలలోన, పాహిరామ ప్రభో, పిడికిట తలంబ్రాలు, శ్రీహనుమజయ హనుమ, గరుడ గమనము, రామ కోదండరామ, హరినామ మొక్కడు, క్షీరాబ్ధి కన్యకకు కీర్తనలు ప్రేక్షకులను ఓలలాడించాయి. వీరికి కె.శ్రీరామ్శ్రీనివాస్ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. అనంతరం గాయకులను లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సత్కరించారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ


వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం ఆర్జిత సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పిస్తారు.

27న 'పద్మశ్రీ' ఖాదర్ వలీకి పౌర సన్మానం


మాట్లాడుతున్న రైతు సంఘం చైర్మన్ రాజు

సీతంపేట: చిరుధాన్యాల శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీకి ఈ నెల 27న పౌర సన్మానం నిర్వహించనున్నట్టు గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం చైర్మన్ పి.ఎల్.ఎన్.రాజు తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో 27వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు సన్మాన కార్యక్రమం జరుగుతుందన్నారు. చిరుధాన్యాల ఆహార ప్రేమికులంతా హాజరు కావాలని కోరారు. ముందుగా ఖాదర్ వలీ ప్రసంగం, అనంతరం మిల్లెట్ ఆహారంపై సందేహాలకు సమాధానాలు, చివరగా అభినందన కార్యక్రమం ఉంటుందన్నారు. సంస్థ కార్యదర్శి జి.ఎ స్.ఎస్.రాజు మాట్లాడుతూ మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన ఖాదర్ వలీ దేశ విదేశాల్లో ఉన్నతమైన ఖ్యాతి ఆర్జించారన్నారు. విశాఖ నగరంలో అభిమానుల కోరిక మేరకు ఆయనను స్వాగతించి సన్మానించడానికి నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ ఎం.యుగంధర్‌రెడ్డి, సత్వ నేచురల్స్ అధినేత మధుసూదన్‌రెడ్డి, ప్రకృతి పంటల రైతు సీహెచ్ రిషి, సంఘ నగర అధ్యక్షుడు దాట్ల వర్మ, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి జె.వి.రత్నం పాల్గొన్నారు.

నేల బావిలో దిగి విద్యార్థి మృతి


సాయికల్యాణ్ (ఫైల్)

కూర్మన్నపాలెం: స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొడదామని వెళ్లిన ఓ ఇంటర్ విద్యార్థి నేలబావిలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్ దరి చట్టివానిపాలెం ప్రాంతానికి చెందిన మెకానిక్ జె.శివప్రసాద్, భార్య, కుమారుడు సాయికల్యాణ్(16), కూతురుతో నివాసముంటున్నాడు. సాయికల్యాణ్ ప్రస్తుతం గాజువాకలోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మ్యాథ్స్ పరీక్ష రాసి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. సాయంత్రం 3 గంటలకు తన స్నేహితులు పాల్గుణ, లోకేష్ రెడ్డి, లోహిత్‌లతో కలిసి కాపుజగ్గరాజుపేటలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల వెనక ఉన్న నేలబావిలో ఈత కొట్టడానికి దిగారు. ముందుగా సాయికల్యాణ్ నీటిలో దూకాడు. వెంటనే ఊబిలో కూరుకుపోయాడు. దీంతో అక్కడే ఉన్న గజ ఈతగాడి సాయంతో నేలబావిలో కూరుకుపోయిన సాయికల్యాణ్‌ను పైకి తీసుకువచ్చారు. అయితే అప్పటే ఆయన ప్రాణాలు విడిచాడు. విషయం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలం ద్వారా రూ.10.71 లక్షల ఆదాయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాల నిమిత్తం నెల కాలపరిమితికి శుక్రవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.10 లక్షల 71వేలు ఆదాయం లభించింది. కొండదిగువ భైరవస్వామి ఆలయం వద్ద పూజా సామగ్రి, కొబ్బరికాయలు విక్రయానికి రూ. 4.90లక్షలు, సింహగిరిపై భక్తుల సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరిచేందుకు రూ. 3.52లక్షలు, కొండపైన, కొండదిగువ ఐస్‌క్రీమ్ విక్రయాలు జరిపేందుకు రూ.1.58లక్షలు, గోపాలపట్నంలోని దేవస్థానం స్థలంలో బుధవారం జరిగే సంతలో ఆశీలు వసూలు చేసుకునేందుకు రూ.10,800కి, బుధవారం మినహా మిగతా రోజుల్లో ఆశీలు వసూలుకు రూ.11వేలకు, వరాహ పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయానికి రూ.50 వేలకు పాట దారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవోలు ఇజిరోతు శ్రీనివాసరావు, ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు తదితరులు ఈ వేలం పాటలు నిర్వహించారు.

చట్టాలపై పోలీసులకు అవగాహన ముఖ్యం

విశాఖ, లీగల్ : పోలీసులు పౌర,నేర శిక్ష స్మృతి పరిధిలోని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో న్యాయసేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసులు- చట్టాలు అన్న అంశంపై జరిగిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. నేరంతో ప్రమేయంలేని అమాయకులను అరెస్టు చేస్తే తీవ్రమైన శిక్షకు గురికావలసి వస్తుందని హెచ్చరించారు. నిత్యం చట్టాలపై మూల్యాంకనం అవసరమన్నారు. వివిధ చట్టాలను వివరించారు. న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ మాట్లాడుతు పోలీసులు లోక్‌అదాలత్ సేవలను తెసుసుకోవాలన్నారు. మోటారు వాహన చట్టాలు, పరిహారం చెల్లింపు, బాలనేరస్తుల చట్టాలు అన్న అంశాలపై న్యాయసేవా ప్రాధికార సంస్థ జాతీయ శిక్షకులు రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, నగరంలోని అన్ని పోలీసు స్టేషన్లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సిప్ మంత్ర యాప్ ప్రారంభం

అల్లిపురం: ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన సిప్ మంత్ర యాప్‌ను అధికారులు ప్రారంభించారు. ద్వారకా బస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రవికుమార్, డీపీటీవో ఎ.అప్పలరాజు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బి.అప్పలనాయుడు, డీసీటీఎం జి.సత్యనారాయణ, ఏటీఎం రాజు పాల్గొని ప్రారంభించారు.

ట్రాన్స్‌పోర్టు లారీలకు జీపీఎస్ వ్యవస్థ తప్పనిసరి


లారీ యజమానులతో సమావేశమైన డీసీపీ-2 ఆనందరెడ్డి

అల్లిపురం: ట్రాన్స్‌పోర్టు లారీలన్నింటిలో తప్పనిసరిగా జీపీఎస్ వ్యవస్థ అమర్చాలని, లోడింగ్ పాయింట్ నుంచి గమ్యస్థానం చేరేంత వరకు సంబంధిత లారీ ట్రాన్స్‌పోర్టు వారు సదరు లారీల ట్రాకింగ్ డేటా భద్రపరచాలని జోన్-2, డీసీపీ కె. ఆనందరెడ్డి కోరారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన లారీ ట్రాన్స్‌పోర్టు సంఘాల యాజమాన్యాలతోను, స్టీవ్ డోరింగ్ కంపెనీల ప్రతినిధులతో పోర్టుట్రస్ట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టుట్రస్ట్ కేటాయించిన యార్డుల్లో సంబంధిత సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, కంపెనీ యాజమాన్యాలు సూపర్‌వైజర్లను, సెక్యూరిటీ గార్డులను నియమించుకునే క్రమంలో ఆయా సంస్థలు గత చరిత్ర, నేరచరిత్రను తప్పక పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్టీవ్ డోర్స్ కంపెనీ వారు జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే లోడింగ్‌కు అనుమతించాలని కోరారు. పోర్టులో షిప్ నుంచి లోడ్ అన్‌లోడ్ చేసిన మెటీరియల్ యార్డ్‌కు పంపించే సమయంలో ప్రతి లారీకి రశీదు అందించి అన్‌లోడ్ అయిందా లేదా అని తనిఖీ చేసుకోవాలన్నారు. వేయింగ్ బ్రిడ్జి వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలని యజమానులకు తెలిపారు. ఈ సమావేశంలో హార్బర్ ఏసీపీ, హార్బర్ సీఐ, పోర్టుట్రస్ట్ ట్రాఫిక్ మేనేజర్ పాల్గొన్నారు.

రంజింపజేసిన సంగీత విభావరి


కళాకారులను సత్కరిస్తున్న ఆచార్య రాజు, బైపా అరుణకుమార్ తదితరులు

అల్లిపురం: రస రాగ మాధురి, శృతిలయ సంగీత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యాన్ ఈవినింగ్ ఇన్ పారిస్ శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరి రంజింపజేసింది. కార్యక్రమాన్ని సెంచూరియన్ యూనివర్శిటీ ఉపకులపతి జీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన కళాకారులను సత్కరించారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో ఎమ్మెస్ మాధవ్, జ్యోతి పాడిన ఈ ఎర్ర గులాబీ విరిసింది, ప్రభాకర్, కళ్యాణి పాడిన దిల్ తడప్ తడప్‌కే, మెలోడీ సత్యనారాయణ, సత్యశ్రీ పాడిన కొండ కోన పాలైన పాటలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బైపా అరుణకుమార్, సినీ నటుడు ఆన్ యాదకుమార్, ఎంవీ రాజశేఖర్, కళారంగ ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలపై ఉక్కుపాదం

- పెండింగ్ చలానాల వసూలు


ఎన్ఏడీ జంక్షన్ దిగువ రహదారిలో నిలిపి ఉన్న ఆటోలు


ఆటో డ్రైవర్ వివరాలు సేకరిస్తున్న సీఐ మళ్ల అప్పారావు

గోపాలపట్నం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడంతో విధించిన చలానాలు కట్టకుండా తిరుగుతున్న ఆటోవాలాలపై కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. గురువారం, శుక్రవారాలు ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దిగువ రోడ్డులో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు మాట్లాడుతూ చాలా ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫైన్లను వసూలు చేసే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. రెండు రోజుల్లో రూ.37,740 వసూలు చేసినట్టు చెప్పారు. ఆటోకు కనీసంగా 10 నుంచి 20కి పైగా పెండింగ్ ఫైన్లు ఉన్నాయని ఇవి ఏళ్ల తరబడి కట్టకుండా తిరుగుతున్నారని తెలిపారు. ఆటోవాలాలు నిర్లక్ష్యంగా ఉండడం వల్లే ఇలా పెరిగిపోయాయన్నారు. ఎన్ఏడీ బ్రిడ్జ్ దిగువ రహదారిలో ఆటోలు పార్కింగ్ చేయడం, ప్రయాణికులను దించడం ఎక్కించడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. దిగువ రోడ్డులో ఆటో డ్రైవర్లు ఆపితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం నిత్యం ట్రాఫిక్ సిబ్బంది ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్ఏడీ బ్రిడ్జి దిగువన రాంగ్ పార్కింగ్ చేసిన 992 వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. తనిఖీలు కంరపాలెం కొనసాగిస్తామన్నారు. ఆయనతో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా


కంచరపాలెంలో ప్రభుత్వ ఉపాధి కార్యాలయం

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ ఉపాధి కార్యాలయం(క్లరికల్) ప్రాంగణంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక జరగనుందన్నారు.

ఇవీ వివరాలు..

- హెటిరోల్యాబ్స్ లిమిటెడ్‌లో 200 జూనియర్ కెమిస్ట్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి 20–26 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు రూ.22,800 జీతం ఇస్తారు.
- పొలగాని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు కంపెనీలో 30 ప్రాసెస్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీ/పీజీ/ఏదైనా డిప్లొమా అర్హత కలిగి 20–25 ఏళ్ల లోపు వయసు ఉండాలి. నెలకు రూ.12,000 జీతం ఉంటుంది.
- స్టీల్ సిటీ సెక్యూరిటీ లిమిటెడ్(సీతంపేట–విశాఖపట్నం)లో 20 టెలీకాలర్స్, 20 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, 20 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ, 25 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు జీతం రూ.12,000.
- క్లోవ్ టెక్నాలజీస్‌లో 15 ఆటో క్యాడ్ పోస్టులకు బీటెక్(సీఎస్ఈ), 22–27 ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు అర్హులు. జీతం 13,500. ఇదే సంస్థలో డిప్లొమా లేదా ఏదైనా బీటెక్ చేసిన వారికి డెవలపర్స్ ఉద్యోగానికి అవకాశం ఉంది. నెలకు రూ.13,500 జీతం ఉంటుంది.
- పేజెస్ సంస్థలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, డాటా సోర్సింగ్, కమ్యూనికేషన్ పోస్టులను భర్తీ చేస్తారు. సైన్స్ డిగ్రీ/బీ ఫార్మసీ/ఎం ఫార్మసీ/బీఎస్సీ/ఎంఎస్సీ/బీటెక్ కంప్యూటర్స్ కోర్సులు చేసి 30 ఏళ్ల వయసు లోపు ఉన్న వారు అర్హులు. విశాఖలో రూ.16,000, హైదరాబాద్‌లో రూ.18,000 జీతం ఇస్తారు.
- ట్రస్ట్ సర్వీసెస్‌లో ఫిట్టర్, వెల్డర్, ఫ్యాబ్రికేట్, గ్రైండర్స్ హెల్పర్స్ 10 పోస్టులకు ఐటీఐ చదివి 18–48 ఏళ్ల వయసు గల వారు అర్హులు. నెలకు రూ.15,000 నుంచి రూ.25,000 వరకు జీతం ఉంటుంది.
- సువర్ణభూమి సంస్థలో మార్కెటింగ్ మేనేజరు పోస్టుకు బీటెక్/ఎంబీఏ అర్హత కలిగి 18–36 ఏళ్ల వయసు గల వారిని తీసుకుంటారు. పది పోస్టులు ఉన్నాయి. నెలకు రూ.17,000 జీతం. ఇదే సంస్థలో 10 టెలికాలర్ ఉద్యోగాలకు 18–36 ఏళ్ల వయసు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జీతం రూ.9,000. అభ్యర్థులు నేరుగా కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయానికి శనివారం ఉదయం 10 గంటలకు హాజరు కావచ్చు. ఆసక్తి గల వారు ncs.gov.inలో పేర్లు నమోదు చేసుకోవాలి.

వడివడిగా సంద్రం వైపు...


తాబేళ్లను ఉంచిన బుట్టలతో మత్స్యకారులు


పెదనాగమయ్యపాలెం వద్ద సముద్రంలోకి వడివడిగా కదులుతున్న తాబేలు పిల్లలు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం తీరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షించిన తాబేలు గుడ్లు పిల్లలుగా మారడంతో శుక్రవారం ఉదయం పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం మత్స్యకారులు, పంచాయితీ పెద్దల ఆధ్వర్యంలో సముద్రంలోకి వదిలారు. సముద్ర ఘోష వినిపించిన వైపు తాబేలు పిల్లలు వడివడిగా సాగిపోయాయి. స్థానిక మత్స్యశాఖ ప్రతినిధులు తోట ముసలయ్య, గరికిన లక్ష్మణ, దూడ ధనంకొండ తదితరులు మాట్లాడుతూ తీరంలో తాబేళ్ల గుడ్లు పెట్టిన తర్వాత మత్స్యకారులు ఇసుకలో అడుగున్నర లోతు తవ్వి సేకరిస్తారన్నారు. ప్రత్యేకంగా వెదురు కర్రలతో తడికెలు నిర్మించి వాటిని భద్రపరుస్తారన్నారు. దీనివల్ల పక్షులు, ఇతర జంతువుల బారినపడకుండా ఉంటాయన్నారు. 50 రోజుల తర్వాత గుడ్ల నుంచి పిల్లలు బయటకు వచ్చిన తర్వాత సూర్యోదయం వేళ బుట్టల్లో భద్రంగా తీసుకొచ్చి తీరంలో వదిలితే అలల శబ్దానికి వడివడిగా తాబేళ్లు సముద్రంలో కలసిపోతాయన్నారు. శుక్రవారం 640 తాబేలు పిల్లలను సముద్రంలో వదిలినట్టు వారు తెలిపారు. ఇంకా మరిన్ని గుడ్లు తీరంలో ఉన్నాయని తెలిపారు.

దొంగతనం కేసులో ఏడాది జైలు శిక్ష

- రూ.10 వేల జరిమానా

మల్కాపురం: గతేడాది స్థానిక జవహర్‌నగర్ వద్ద జరిగిన చోరీ కేసులో పట్టుబడిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ మూడో ఏసీఎంఎం మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి మల్కాపురం సీఐ లూథర్‌బాబు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్ లో మారుబిల్లి లక్ష్మీ అనే మహిళ తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. అయితే గతేడాది ఈమె ఇంట్లో రాగోలు నిషాంత్(అలియాస్ సొట్టా) అనే వ్యక్తి దొంగతనానికి పాల్పడ్డాడు. తులంన్నర బంగారు ఆభరణం,విలువైన వెండి వస్తువులను దొంగలించాడు. దీంతో ఆమె క్రైం పోలీసులను ఆశ్రయించింది. దీనిపై హార్బర్ క్రైం సీఐ ఎ.అవతారం ఆదేశాలతో ఏఎస్ఐ శ్రీరామ్ దర్యాప్తు చేశారు. దొంగతనానికి పాల్పడ్డ నిషాంత్ ఇందిరాకాలనీ ప్రాంతవాసి అని గుర్తించారు. దీంతో ఆ వ్యక్తిని అరెస్టు చేసి బంగారం,వెండి వస్తువులు స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించారు. కేసు దర్యాప్తు అనంతరం చార్జ్ షీట్ ఫైల్ చేసి ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నేరం రుజువు కావడంతో మూడో ఏసీఎంఎం మెజిస్ట్రేట్ ఈ. రాజేంద్రబాబు దొంగతనానికి పాల్పడ్డ నిషాంత్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానావిధించారు.

సబ్ రిజిస్ట్రార్-2గా శ్రీనివాసులు


విధుల్లో శ్రీనివాసులు

జగదాంబ: సబ్ రిజిస్ట్రార్-2గా శ్రీనివాసులు నియమితులయ్యారు. చౌల్ట్రీ వద్ద ఉన్న ఈ కార్యాలయంలో ఇప్పటి వరకు నిరంజన్ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించేవారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లలో అలసత్వం లేకుండా చూస్తామన్నారు. మొదటి రిజిస్ట్రార్‌గా గీతాలక్ష్మి ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు.